# పిచ్చి దానిమ్మచెట్టు

రచన: ఒడిస్స్యూస్ ఎలిటిస్ అనువాదం: శ్రీ శ్రీ

తెల్లగా వెల్లవేసిన ఈ వసారాల్లో
అనుకూల దక్షిణ వాయువులు ప్రసరించే అందమైనగదుల వెలుపల
ఇట్టే వెలుతురులోకి ఉరికేది
ఈపిచ్చి దానిమ్మచెట్టేనా, చెప్పవూ ?
ఉయ్యాలలూగే గాలుల గుసగుసలలో
సారవంతమైన తన సంతోషాన్ని వెదజల్లేది
ఎవరు చెప్పవూ, ఈపిచ్చి దానిమ్మచెట్టేనా ?
ఉదయవేళ అప్పుడే తొడిగిన మొగ్గలతో
ఊగుతూ ఉవ్వెత్తుగా తన రంగుల పింఛం విప్పి
విజయగర్వ రోమాంచంతో కులికేది
చెప్పవూ ఈ పిచ్చి దానిమ్మచెట్టేనా ?

పాలికాపు బాలికలు పొలాలలో నగ్నంగా
నిద్రబద్ధకపు లోతులు దులిపేస్తూ
లవంగాలు తమ పసిరిక చేతులతో పోగుచేసేటప్పుడు
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
సూర్యకాంతిని వాళ్ల తట్టల కెత్తేది ?
వాళ్ల పిలుచుకునే పేర్లని పాటలతో ముంచెత్తేది ?
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
ప్రపంచపు నీడలతో పోరాడేది ?

ఈసులాడి దినం తన్ను ఏడు నిగనిగని రెక్కలతో అలంకరించుకొని
అనంత సూర్యబింబంచుట్టూ ఆకాశ సహస్రాలను చుడుతున్నప్పుడు
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
వెయ్యికొరడాలు పుచ్చుకొని
దౌడుతీసే గుర్రాలను జూలులాగి నిలబెడుతుంది?
ఒకసారి విషాదంతో, ఒకమారు విభ్రమిస్తూ
ఈపిచ్చి దానిమ్మచెట్టేనా చెప్పవూ
ఏదో నవాశాప్రభాతాన్ని ఎలుగెత్తి చాటుతుంది ?

ఓహో చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
సుదూరంలో పరవళ్లు తొక్కుతూ
వెయ్యిపడవల్ని కడుపుతో ఉన్న కడలిలాగ
ఇతరుల అడుగుజాడ ఎరుగని తీరాలకు
విరగబడే కెరటాలు పంపుతూ
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
ఆకుల పోకెట్ రుమాలు ఊపుతుంది ?
సరికొత్త నిప్పులు చెరుగుతుంది ?
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
ఫేటతెల్లని గాలికి తెరచాప ఎత్తుతుంది ?

నిర్లక్ష్యంగా ప్రమాదకరంగా
ద్రాక్షలతల వినీల శిఖరాలమధ్య
విందులతో వీరావేశంతో
ఎవరు చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
ప్రపంచపు నడుంమీద వెలుతురుతో విరుచుకుపడి
రాక్షసి తుపానుల ప్రసారాన్ని ప్రతిఘటించి
చెప్పవూ ఈపిచ్చి దానిమ్మచెట్టేనా
పంటలతో పాటలతో సరిగంచులు దిద్దిన
ప్రత్యూషపు పసుపుపచ్చని సింహాపుజూలు పట్టుకొని
దివసకాంత కట్టుకున్న పట్టుచీరని
హఠాత్తుగా జార లాగివేస్తుంది ?

చైత్రమాసపు రవికలుధరించి శ్రావణమాసపు విపంచిధ్వనించి
చెప్పవూ ఆడుకునే పాడుకునే ఈవిడ
మనకి మతులు పోగొట్టే ఈవిడ
బీభత్సాన్ని పట్టుకొని ఊపేసి
కాటుక చీకటి సీడలు రాల్పించి
సూర్యుడి గోళంలో మత్తెక్కిన పక్షుల్ని వొంపేస్తే ఈవిడ
సమస్తవస్తువుల హృదయాలలో
మన ప్రగాఢ స్వప్నాల గుండెలలో
విశాలంగా తన రెక్కలు విప్పుకునే ఈవిడ
ఎవరు ఈపిచ్చి దానిమ్మచెట్టేనా ?